క్లుప్తంగా

పుస్తకాల అందజేత



చిన్నచింతకుంట: మండలకేంద్రంలోని గ్రంథాలయానికి ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ లిబరిటీస్ అండ్ సోషల్ జస్టీస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వివిధ పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలను గురువారం అందజేశారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రమాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ సువర్ణ రాజుల చేతులమీదుగా గ్రంథాలయ అధికారి చంద్రయ్య పుస్తకాలు అందుకున్నారు. మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సొంత భవనం నిర్మించాలి



మిడ్జిల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం అద్దెభవనంలో కొనసాగిస్తుండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గురువారం కులవివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వెంటనే సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రాజీవ్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరుశరామ్, విష్ణు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



అడ్డాకుల: మూసాపేట మండలం కనకాపూర్, చక్రాపూర్ గ్రామస్తులు గురువారం అన్నాసాగర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని సత్కరించారు. జాతీయ రహదారి నుంచి కనకాపూర్, చక్రాపూర్, స్ఫూర్తితండా మీదుగా లక్ష్మింపల్లి వరకు 7.20 కిలోమీటర్ల దూరం రోడ్డుకు రూ.2.45కోట్లు మంజూరు చేయించిన సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ తదితరులు ఉన్నారు.

శిబిరం ఏర్పాటు



గండేడ్: టీబీ సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక వైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శిబిరం ఏర్పాటు చేశారు. మందులను పంపిణీ చేశారు. వైద్యుల సూచనల మేరకు మందులను వాడాలని సూచించారు. వైద్యబృందం ఉన్నారు.

ఇష్టపడి చదవాలి

బాలానగర్: విద్యార్థులు అభ్యసించే సమయంలో ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించగలుగుతారని జిల్లా విద్యాధికారి రవీందర్ అన్నారు. గురువారం మండలపరిధిలోని కస్తూర్బాలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వయంగా 10వ తరగతి విద్యార్థులకు గణితం బోధించారు. ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. అనంతరం వసతులపై ఆరా తీశారు. సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకు రావాలని సూచించారు. సీఎంఓ బాలు యాదవ్, మంజులాదేవి తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

చిన్నచింతకుంట: ప్రజలు సైబర్‌నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శేఖర్ సూచించారు. అల్లిపురంలో వివిధ అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో బాల్యా వివాహాలను అరికట్టాలని అన్నారు. బాల కార్మికవ్యవస్థను రూపుమాపేందుకు కృషి చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

మిడ్జిల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం ఐద్వా మాజీ జిల్లా అధ్యక్షురాలు అరుణ 3వ వర్ధంతి సందర్భంగా సన్మానించారు. వాడ్యాల్ స్టేజీ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో పెరుగుతున్న ధరలు, ప్రజల ఇబ్బందులపై సెమినార్ నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హైమావతి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ న్యూటౌన్: అరుణ ఆశయ సాధనకు కృషిచేద్దామని ఐద్వా రాష్ట్ర నాయకురాలు గీత అన్నారు. గురువారం ఆమెకు నివాళులర్పించారు. సీఐటీయూ, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్రానికి పట్టిన శని కాంగ్రెస్



దేవరకద్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



పోలేపల్లి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

జడ్చర్ల టౌన్: రాష్ట్రానికి పట్టిన శని కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తీవ్రంగా విమర్శించారు. మూడు గంటల కరెంట్ చాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించటాన్ని నిరసిస్తూ మండలంలోని పోలేపల్లి సబ్‌స్టేషన్ ఎదుట, నియోజకవర్గం కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నాలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం రాక ముందు వచ్చిన తర్వాత పరిస్థితులను అర్థం చేసుకోవాలన్నారు. నాడు కరెంట్ కోసం పడిగాపులు కాసేవారమని, ఇప్పుడు గ్రామాల్లోనూ 24 గంటల కరెంట్ అందిస్తున్నామన్నారు. రైతులకు ఉచిత కరెంట్ కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేదని, అందుకే ఇక్కడ అమలు చేయకుండా ఉండేలా విధానాలు రూపొందిస్తున్నారన్నారు. మూడు గంటల కరెంట్ వాఖ్యలు కాంగ్రెస్ పార్టీ పాలసీ అని ఆరోపించారు. 24 గంటల కరెంట్ చేతకాదని వారు చెబుతున్నారని, అందులోభాగంగానే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో రోడ్డెక్కి ధర్నాలు చేసే పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరు వల్ల మళ్లీ ఆ పరిస్థితి వచ్చిందన్నారు. ఇతర దేశాల్లో ఉన్నట్లుగా 24గంటల కరెంట్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణగా అన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, నాయకులు పాల్గొన్నారు.

దేవరకద్ర: రైతులకు మూడు గంటల విద్యుత్ ఇస్తామని అవమానించిన రేవంత్‌రెడ్డి ఆటలు ఇక సాగవని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం నియోజకవర్గ కేంద్రంలోని సబ్ స్టేషన్ వద్ద చేపట్టిన రాస్తారోకోలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను చూసి ఓర్వలేక కుట్రలు చేస్తున్నారని, నిజస్వరూపం బయట పెట్టుకున్నాడని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఆరు నెలల్లోనే ఉచిత విద్యుత్ అమలు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కాంగ్రెస్ హయంలో రైతులకు చేసిందేమీ లేదని అన్నారు. రైతు వ్యతిరేక విధానాల పార్టీ కాంగ్రెస్ అని, కనుమరుగు కాక తప్పదని విమర్శించారు. కాగా బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జెడ్పీటీసీ అన్నపూర్ణ, ఎంపీపీలు హర్షవర్ధన్‌రెడ్డి, కదిరె శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్ / సాక్షినెట్‌వర్క్ : రైతుబంధు మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ ఓబ్లాయిపల్లి, ధర్మాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో రైతువేదికల వద్ద గురువారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు. సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయానికి సీఎం కేసీఆర్ అందిస్తున్న ఉచిత కరెంట్ జోలికొస్తే రైతుల ఆగ్రహం తప్పదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం వెంకటాపూర్ రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పంటలకు క్రాప్ హాలీడేలు, పరిశ్రమలకు పవర్ హాలీడేలు ప్రకటించిన అసమర్థ పాలన కాంగ్రెస్‌దని విమర్శించారు. డైరెక్టర్ సయ్యద్ మసీయొద్దీన్, సర్పంచులు పాల్గొన్నారు.

- బాలానగర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మణ్ నాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేశారు. మండల ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్‌లో ఆల శశివర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల కోఆప్షన్ ఖాజా, ఉపసర్పంచ్ రాజిరెడ్డి ఉన్నారు.
- మిడ్జిల్ మండలంలో ఎంపీపీ సుదర్శన్, నాయకులు పాండుయాదవ్, బాలు, శ్రీనువాస్‌గౌడ్, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- నవాబుపేటలో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య పాల్గొన్నారు.
- రాజాపూర్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పిరిబచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ న్యూటౌన్(హన్వాడ): మండలంలోని సబ్‌స్టేషన్ల వద్ద బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళనలు చేశారు. హన్వాడలో కొండలక్ష్మయ్య, నెత్తికొప్పుల శ్రీనివాసులు, డాక్టర్ సత్యం, జంబులయ్యల ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

పోస్టర్ విడుదల

మహబూబ్‌నగర్ న్యూటౌన్(హన్వాడ): పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 16 నుంచి నిర్వహించనున్న యాత్ర వాల్‌పోస్టర్‌ను గురువారం టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు బాలస్వామి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆవిష్కరించారు. మండల నాయకుడు బాల్‌రాజ్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్(హన్వాడ): క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల ఉద్యోగాలకు భద్రత కల్పించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతానని మంత్రి హామీ ఇచ్చారు. నారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో నిరసన

నవాబుపేట: మండలంలో కళ్లకు గంతలు కట్టుకుని పంచాయతీ కార్మికులు గురువారం నిరసన తెలిపారు. వేతనం తదితర విషయాల్లో స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కార్మిక సంఘం జేఏసీ నాయకులు లక్ష్మయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

దేవరకద్ర: కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు సీహెచ్ రాంచందర్ డిమాండ్ చేశారు. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండలంలో సమ్మెకు మాజీ ఎంపీపీ శాంతీబాయి, మాజీ ఎంపీటీసీ వేణుగౌడ్ తదితరులు మద్దతు తెలిపారు.

మిడ్జిల్: పంచాయతీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ సహాయ కార్యదర్శి సత్తయ్య గురువారం మద్దతు తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ తరగతి గదిలో మద్యం సీసా

జడ్చర్ల: తరగతిగదిలో మద్యం సీసా కనిపించడం చర్చనీయాంశంగా మారిన ఘటన పోలేపల్లి ప్రభుత్వ పాఠశాలలో చోటు చేసుకుంది. మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి గదిని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గురువారం ప్రారంభించారు. బెంచీలపై ఎమ్మెల్యేతో పాటు అధికారులు కూర్చుని టీవీని వీక్షించారు. ఈ సమయంలో బెంచీ డెస్క్‌లో ఓ మద్యం సీసా మీడియా కంట పడింది. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు, అధికారులు తాళం వేసి ఉన్న గదిలోకి మద్యం సీసా ఎలా వచ్చిందన్న దానిపై విచారించారు. విషయం దాచిపెట్టే ప్రయత్నం చేసినా అప్పటికే అందరికీ చేరి చర్చనీయాంశంగా మారింది.

కార్పొరేట్‌కు దీటుగా సర్కార్‌బడులు

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



జెడ్పీహైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని అందులో భాగంగానే సర్కారు బడులను బలోపేతం చేస్తూ మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పోలేపల్లిలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మన ఊరు మన బడి కింద జెడ్పీహైస్కూల్‌లో రూ.54.87 లక్షలతో చేపట్టినపనులను ప్రారంభించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు బలోపేతం అయ్యాయని, తమ ప్రభుత్వ హయాంలో సర్కారు బడుల రూపురేఖలు మారిపోయాయన్నారు. డిజిటల్ బోర్డులు, బాలికల టాయిలెట్స్ ఏర్పాటయ్యాయన్నారు. ఉపాధ్యాయులకు సైతం గౌరవం పెరిగిందని, ప్రభుత్వపాలన వల్ల పనితీరులో మార్పు వచ్చిందన్నారు. విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందుతున్నారన్నారు. పదేళ్ల కిందటి వరకు దీపాల వెలుగులో చదువులు సాగేవన్నారు. నేడు పరిస్థితి మారిందన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని కస్తూర్బా పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. డీఈఓ రవీందర్ మాట్లాడుతూ జిల్లాలో మన ఊరు మన బడి మొదటి దశ పనులు పూర్తి కావచ్చాయని, రెండవ దశ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా నియోజకవర్గంలోని 5 కస్తూర్బా పాఠశాలలను సీఎస్‌ఆర్ ప్రణాళిక ద్వారా అభివృద్ధి పర్చేందుకు సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. సమావేశంలో జెడ్పీవైస్‌చైర్మన్ యాదయ్య, సర్పంచ్ చేతన, ఎంఈఓ మంజులాదేవి, హెచ్‌ఎం నాగేంద్రమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ చంద్రశేఖర్, ఈఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రూ.15లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలోని రెండవ రేషన్ దుకాణం ప్రారంభించారు. రూ.10లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, రూ.8లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లను ప్రారంభించారు. శివాలయ నిర్మాణం కోసం పూజలు చేశారు.

మొక్కలు నాటిన చైర్మన్, కమిషనర్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: న్యూటౌన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా మెయిన్ రోడ్డు పక్కన గురువారం మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సిములు, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ తదితరులు మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో 19, 20వ వార్డు కౌన్సిలర్లు షబ్బీర్‌అహ్మద్, రావుల అనంతరెడ్డి, డిప్యూటీ ఈఈ బెంజిమన్, ఏఈ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టన్నెల్ పరిశీలన



జడ్చర్ల: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి మండల నిర్మిస్తున్న ఉదండాపూర్ -కరివెన రిజర్వాయర్ టన్నెల్‌ను గురువారం బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పాలక మండలి సభ్యులు సందర్శించారు. సొరంగం గుండా వెళ్లి చేపట్టిన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో యార్డు చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ దానీష్, డైరెక్టర్లు రంగబాను, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగరాజు, వినోద్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేపల్లిలో బోనాలు

నవాబుపేట: దేపల్లిలో గురువారం బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజులు, బోనాల ఊరేగింపు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ లత, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాములు, రఘుగౌడ్, వెంకట్రములు, రమేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు

ప్రారంభమైన ఉర్సు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని ఎర్రకుంట సమీపంలో హజ్రత్ బర్హానే బాదేషా రహెమతుల్లా అలై దర్గా 253వ ఉర్సు ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ముతవల్లీ డాక్టర్ గయాజ్‌పాషా హకం షరీఫ్ ఆధ్వర్యంలో మొదటి రోజు జలాభిషేకం (గుస్లేషరీఫ్) నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, ఫైజానే అవులియా ధార్మిక సదస్సు (సెమినార్) చేపట్టారు. ప్రధాన ఘట్టమైన గంధోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ముతవల్లీ తెలిపారు.

పీయూ అధ్యాపకుడికి పదోన్నతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రకిరణ్‌కు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చంద్రకిరణ్‌కు అభినందనలు తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జేపీఎన్‌సీ చైర్మన్ రవికుమార్ పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు 19 మంది సిస్కో ఐడియాథాన్ పోటీలకు ఎంపికైన సందర్భంగా మాట్లాడారు. ఎంపికైన వారికి మంచి పారితోషికం ఉంటుందని తెలిపారు. కళాశాలలో టాస్క్ తదితర సంస్థల ఆధ్వర్యంలో ఇచ్చే శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ సుజీవన్, కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆందోళన

మహబూబ్‌నగర్ న్యూటౌన్(హన్వాడ): మండలంలోని సబ్‌స్టేషన్ల వద్ద కాంగ్రెస్ నాయకులు ఆందోళనలు చేశారు. వేపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నాయకులు యాదవరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

హరితహారం లక్ష్యం చేరుకోవాలి

మిడ్జిల్: హరితహారం కార్యక్రమంలో ప్రతి గ్రామపంచాయతీ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ యాదయ్య సూచించారు. గురువారం పంచాయతి కార్యదర్శులకు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయాలని, ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ, ఏపీఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్యులు సేవకు మారుపేరు



హెల్త్‌క్యాంప్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్యవైశ్యులు సేవకు మారుపేరని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దేశవ్యాప్తంగా నిత్యాన్నదాన సత్రాలు, ఆరోగ్య శిబిరాలు, పేదలకు వివిధ రకాల సేవలు అందిస్తూ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నారని అన్నారు. జిల్లా కేంద్రం బ్రాహ్మణవాడీలోని వాసవీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం, యశోదా ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన హెల్త్‌క్యాంప్‌ను మంత్రి ప్రారంభించారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు అండగా ఉంటామన్నారు. మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ రాజేశ్వర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు గుండ వెంకటేశ్, వేణుగోపాల్, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12 శాతం రిజర్వేషన్లపై సమాధానం చెప్పాలి



మాట్లాడుతున్న జహీర్ అఖ్తర్

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం కేసీఆర్ 12 శాతం రిజర్వేషన్లపై సమాధానం చెప్పాలని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి మైనార్టీలను మోసం చేశారని ఆరోపించారు. వక్ఫ్ బోర్డుకు జ్యూడీషియల్ అధికారాలు ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రంలో లక్షలాది ఎకరాల వక్ఫ్ భూములు అన్యాక్రాంతమవుతున్నట్లు తెలిపారు. వక్ఫ్ ఆస్తులపై వచ్చే ఆదాయాన్ని పేద ముస్లింలకు ఖర్చు చేయడం లేదని విమర్శించారు. జిల్లా కేంద్రంలో ముస్లింల షాదీఖానా నిర్మాణాన్ని స్వాగతిస్తున్నామని, కానీ ఈద్గా వద్ద కాకుండా అందుబాటులో ఉన్న ఉర్దూ ఘర్ స్థలంలో నిర్మించాలని కోరారు. ముస్లింలకు సంబంధించి ఎక్కువగా రాత్రిపూట వివాహ, శుభాకార్యాలు జరుగుతాయని అందువల్ల పట్టణం నడిబొడ్డున నిర్మించాలన్నారు. రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించడం సరికాదన్నారు. రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన విద్యుత్ ఎక్కడ అందుతుందో చూపెట్టాలని డిమాండ్ చేశారు. మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడు అజ్మత్‌అలీ, నాయకులు జహీర్, సిరాజ్, షబ్బీర్‌అలీ, మొయిజ్, ఫక్రు తదితరులు పాల్గొన్నారు.

సేవాదళ్ విభాగాన్ని బలోపేతం చేయాలి



నియామకపత్రం అందజేస్తున్న కొత్వాల్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని, క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్‌పాషా అన్నారు. జడ్చర్ల మండల సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్‌గా (అధ్యక్షుడు) సీనియర్ నాయకుడు ఎం.ఎ.అబ్దుల్ హన్నాన్ నియమితులైన సందర్భంగా మాట్లాడారు. హన్నాన్‌కు కొత్వాల్, నియామకపత్రం అందజేశారు. నాయకులు ఎండీ.ఇద్రీస్, సుభాష్‌ఖత్రి, వెంకటలక్ష్మి, లోక్‌నాథ్ పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన

మహబూబ్‌నగర్ క్రీడలు: పంజాబ్‌లో ఇటీవలే జరిగిన జాతీయ కిక్‌బాక్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన మరికల్‌కు చెందిన అనూషను గురువారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. క్రీడలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుండడం వల్లే క్రీడాకారులు రాణిస్తున్నారని అన్నారు. అనూష భవిష్యత్తులో మరింతగా గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

గండేడ్: సార్వత్రిక ఎన్నికలకు అధికారులు సిద్ధం కావాలని గండీడ్ తహసీల్దార్ జ్యోతి అన్నారు. గురువారం వివిధ గ్రామాల్లోని పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

డిక్షనరీల పంపిణీ



చిన్నచింతకుంట: బండ్రపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సేవాభారతి పాలమూరు సంస్థ వారు బుధవారం డిక్షనరీలను పంపిణీ చేశారు. సంస్థ రాష్ట్ర సభ్యుడు శివశంకర్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు

అడ్డాకుల: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌పై పోలీసులు కేసునమోదు చేశారు. పొన్నకల్ శివారులోని పెద్దవాగు నుంచి ప్రభుత్వ అనుమతి ద్వారా వివిధ గ్రామాలకు గురువారం ఇసుకను తరలిస్తున్నారు. ఇందులో కొన్ని ట్రాక్టర్లకు లేదన్న సమాచారంతో గ్రామస్తులు వాగు వద్దకు వెళ్లి తనిఖీ చేశారు. అనుమతిలేని వాటిని అడ్డాకుల పోలీసులకు అప్పగించడంతో ఠాణాకు తరలించారు. తర్వాత తహసీల్దార్ కిషన్ అనుమతి పత్రాలను పరిశీలించారు. నాలుగు ట్రాక్టర్లకు అనుమతి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఎస్‌ఆర్‌ఓ రంగన్నను ఠాణాకు పంపించి వివరాలను అందజేయించారు. తిమ్మాయిపల్లి తండాకు చెందిన ట్రాక్టర్‌కు అనుమతి లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ యాదయ్య తెలిపారు. కాగా ట్రాక్టర్ల యాజమానులు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పర్యవేక్షించే ఎస్‌ఆర్‌ఓనే అక్రమార్కులకు సహకరిస్తున్నారని విమర్శిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

రాజాపూర్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. రంగారెడ్డిగూడకి చెందిన కృష్ణయ్య(53) గత మంగళవారం తన భార్య కూలీపనికి వెళ్లిన సమయంలో చిన్నకుమార్తె ప్రేమలతకు బయటికి వెళ్లి వస్తానని చెప్పి ఎక్కడికో వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో భార్య పద్మమ్మ చుట్టుపక్కల, బంధువుల ఇళ్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో గురువారం ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.